క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల తనిఖీ



అంజలి స్కూల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని శ్రీఅంజలి స్కూల్, పినాకిల్ స్కూళ్లను ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతులు, బస్సుల ఫిట్‌నెస్, ఫీజుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చత్రునాయక్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అలక సైదిరెడ్డి, ఎస్‌కె మధార్, ఉపాధ్యాయులు నాగ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి విత్తనాలు తీసుకెళ్లవచ్చని తెలిపారు. 30 కేజీల బస్తాకు రూ.1116 చెల్లించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో గల వెలిదండ ఫీడర్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున శుక్రవారం ఉదయం 7: 30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ నగేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ విని యోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృత్తిపై బాధ్యత గల డాక్టర్‌ను నియమించాలి

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వృత్తిపై బాధ్యత గల డాక్టర్‌ను నియమించాలని, అప్పుడే మెరుగైన సేవలను అందిస్తారని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పెంచికల్‌దిన్న పీహెచ్‌సీకి ప్రతిరోజూ 100 నుంచి 200 మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. ప్రస్తుత వైద్యాధికారి సీతామహాలక్ష్మి వృత్తి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత 17 నెలలుగా డాక్టర్‌పై పిర్యాధులు వస్తున్న జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా స్పందించి బాధ్యతల గల డాక్టర్‌ను నియమించాలని ఆయన కోరారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేస్తున్న మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం పరిధిలోని కిందితండాలో యువతకు గురువారం క్రికెట్ కిట్టు, వాలీబాల్, క్యారం బోర్డులను స్థానిక మాజీ సర్పంచ్ భూక్యా నాగునాయక్, మాజీ ఉపసర్పంచ్ విజయానాగునాయక్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు, యువత అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భరత్‌కుమార్, మాళోతు చింటు, హనుమాన్‌సింగ్, సపావట్ తులసీ, నాగేశ్వరరావు, హుస్సేన్, మాలోతు తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో వైశాఖ పౌర్ణమి వేడుకలు



అనంతపద్మనాభస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో వైశాఖ పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, అనంతపద్మనాభ స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, అరగింపు, తీర్థప్రసాద వితరణను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవో వెంకటచలపతి, అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏల ఖాళీలు భర్తీ చేసేదెప్పుడో..

- గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత
- కార్యదర్శులపై అదనపు భారం
- ఉపాధి పనుల వద్ద తప్పని ఇబ్బందులు
- ఎఫ్‌ఏలను నియమించాలని కోరుతున్న కూలీలు

పాలకవీడు : గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌ల కొరత ఏర్పడింది. దీంతో ఉపాధి హామీ పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులపై అదనపు భారం పడుతోంది. అయితే హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 141 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కానీ కేవలం 62 మంది ఎఫ్‌ఏలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఇక ఫీల్డ్ అసిస్టెంట్ ఉండాలి. కానీ ప్రస్తుతం నియోజకవర్గంలో ఆ ప్రకారం ఎఫ్‌ఏలు లేరు. అయితే గత ప్రభుత్వ హయాంలో కొత్త గ్రామ పంచాయతీలతో పాటు, మృతి చెందిన, ఇతర కారణాలతో విధుల నుంచి తొలగించిన ఎఫ్‌ఏల స్థానంలో కొత్త వారిని నియమించలేదు. ఏడు మండలాల్లో 79 మంది ఎఫ్‌ఏల నియామకం చేపట్టాల్సి ఉంది.

కార్యదర్శులపై అదనపు భారం...

ప్రస్తుతం పాలకవీడు మండలంలోని ఆయా గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. పంట కాల్వల పూడికతీత, కంపచెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు, నర్సరీలు, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ పనులు చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉంది. కానీ అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేనిచోట ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో వారిపై అదనపు భారం పడుతోంది. అయితే కొత్త పంచాయితీలకు పాత పంచాయితీల్లోని ఎఫ్‌ఏలు లేదా కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే కార్యదర్శులు గ్రామల్లో అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరా, మరమ్మతులు, రోడ్ల నిర్వహణ, చెత్త సేకరణ, డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, నర్సరీలు, మొక్కల సంరక్షణ, పన్ను వసూలు, రికార్డుల నమోదు తదితర పనులతో తీరిక లేకుండా గడుపుతున్నారు. వాటికి తోడు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ కేటాయించడంతో పని ఒత్తిడితో ఇబ్బందులు పతున్నారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేని గ్రామాల్లో తక్షణమే నియామకాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



జాన్‌పహాడ్ చెరువులో మట్టి తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలు

పని ఒత్తిడి తగ్గించాలి

ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేసి మాపై పని ఒత్తిడిని తగ్గించాలి. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, నర్సరీలు, మొక్కల సంరక్షణ, నీటి సరఫరా తదితర పనులతో తీరిక లేకుండా ఉంటుంది. దీనికి తోడు ఉపాధి హామీ పనులతో ఒత్తిడికి లోనవుతున్నాం.

– సైదులు, పంచాయతీ కార్యదర్శి, రావిపహాడ్

సమన్వయంతో మండల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ భూక్యా గోపాల్ తెలిపారు. గురువారం పాలకవీడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈఓ తెలిపారు. ప్రతీ గ్రామపంచాయతీకి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నామని భగీరథ ఏఈ మహేష్ తెలిపారు. గ్రామాల్లో ట్యాంకుల నుంచి నీటిని అన్ని వార్డులకు సరఫరా చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని అన్నారు. నీటిపారుదల శాఖ ఏఈఈ సతీష్ మాట్లాడుతూ బెట్టెతండా వద్ద సాగు నీటి లిఫ్ట్ మంజూరైందని తెలిపారు. పాత లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో మండలంలో కొత్త లిఫ్ట్‌లకు అనుమతులు రానున్నట్లు తెలిపారు. అలాగే రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషిచేయాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాళోతు బుజ్జి, ఎంపీడీఓ లక్ష్మి, ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీఓ దయాకర్, వైస్ ఎంపీపీ ఉపేందర్‌రావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినిపించే వారికే అవకాశం ఇవ్వాలి



నిరుద్యోగులతో మాట్లాడుతున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

హుజూర్‌నగర్ : చట్టసభల్లో ప్రజావాణి వినిపించే వారికే అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతని ఆరు నెలలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తూనే వస్తుందని, 6 గ్యారంటీలు, 420 హామీల్లో ఏవి కూడా సరిగ్గా అమలు కావడం లేదని ఆయన ఆరోపించారు. బ్లాక్ మెయిలర్‌కు కాకుండా ప్రశ్నించే గొంతుకే పట్టం కట్టాలని కోరారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు రాకేష్ రెడ్డికే వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కె.సైదిరెడ్డి, జె.నాగేశ్వరరావు, అమర్, నగేష్ రాథోడ్, పి.ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

కోదాడ : దేశ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీకి, రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు బుద్ధి వచ్చేలా పట్టభద్రులు ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. గురువారం కోదాడలోని గ్రంథాలయంలో ఆయన పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీని ఓడించకపోతే రిజర్వేషన్లు రద్దయే ముప్పు పొంచి ఉందన్నారు. బీఆర్‌ఎస్ గడిచిన 10 సంవత్సరాలుగా నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో బచ్చు అశోక్, ముత్తినేని కోటేశ్వరరావు, మైలారశెట్టి సైదయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నేరేడుచర్ల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు జగదీశ్వర్‌రావు కోరారు. గురువారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరిత, ఎంపీపీ శ్రీనివాస్, కౌన్సిలర్లు నాగయ్య, నాయకులు పాండునాయక్, సైదులు, వెంకటేశ్వర్లు, కోటేశ్వర్‌రావు, రాంరెడ్డి, శంకరాచారి, ఖాదర్, నీలామనుష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సైదానాయక్, రాగ్యానాయక్, రవి, రవీంద్రకుమార్, సుఖేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పాలకవీడు : కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి సంగిశెట్టి జగదీశ్వర్‌రావు కోరారు. గురువారం ఆయన మండలంలో ఎంపీపీ భూక్యా గోపాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఉపేందర్‌రావు, వెంకటయ్య, ఉపేందర్, నీమా నాయక్, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, తీన్మార్ మల్లన్న ఎన్నికల టీం పరిశీలకుడు విజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం

మునగాల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు గెలిపించాలని కోరుతూ గురువారం మునగాల మండలంలోని కలకోవలో కాంగ్రెస్ పార్టీ నాయకుప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాతకొట్ల నాగరాజుకు గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్, నాయకులు దొంగరి అప్పారావు, చిర్రా శ్రీనివాస్, తిప్పని వీరయ్య, కుదుముల వీరయ్య, పనస చినశ్రీను, బొడ్డుపల్లి శ్రీను, సిద్దుల వీరయ్య, పులి రాంబాబు, పనస తిర్పయ్య, పనస శివనాద్రి, సైదులు, నాగేష్ పాల్గొన్నారు.



కోదాడ గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. గురువారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని లక్కవరం, అమరవరం, అంజలీపురం, మర్రిగూడెం గ్రామాల్లో పీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అబ్జర్వర్ విజయ్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, మాజీ సర్పంచ్ చామకూరి గురుపాథం, సైదులు, గురువారెడ్డి, వీరనాగిరెడ్డి, అజ్మతుల్లా, పట్టభద్రులు పాల్గొన్నారు.

చాకిరాల, శ్రీరంగాపురంలో ప్రచారం

నడిగూడెం : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలంటూ గురువారం ఎంపీపీ యాతాకుల జ్యోతి చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ నాయకులు నూకపంగు వెంకన్న, మిట్టగణుపుల మోష, సైదులు, సందీప్, ముత్యాలు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్వర్‌రావు



నడిగూడెం : చాకిరాలలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ జ్యోతి

క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న పీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఉచిత వాలీబాల్ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు జిల్లా బ్యాడ్మింటన్ కోచ్ ప్రకాష్‌నారాయణ అందజేసిన దుస్తులను గురువారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపులో శిక్షణ తీసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. పిల్లలు తమకు ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్ జూలురు వీరభద్రం, లంకెల నిరంజన్‌రెడ్డి, మహా సిమెంట్ ఎస్టేట్ మేనేజర్ చెరకుఅశోక్, విష్ణు, శ్రీను, రంగా, ఖలీద్, రాఘవ తదితరులు ఉన్నారు.

మట్టపల్లి లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అన్నదానం



గౌడ కుల సత్రంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

మఠంపల్లి : మట్టపల్లిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చిన రెండు రాష్ట్రాల భక్తులకు వివిధ కులాల అన్నదాన సత్రాల ఆధ్వర్యంలో బుధ, గురు వారాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ, గౌడ, మున్నూరుకాపు, యాదవ, పద్మశాలీ, ముదిరాజ్, శాలివాహన, పురగిరి క్షత్రియ, భట్రాజు, రజక, నాయీబ్రాహ్మణ, మాల, గిరిజన కులాల సత్రాల్లో వేలాది మందికి అన్నదానం, వసతి సౌకర్యం కల్పించారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, ఆలయ కమిటీ చైర్మన్ వేమూరి నరసింహారావు, వేమూరి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి డిగ్రీ కళాశాల ఉద్యోగి మృతి

- మృతుడు కోదాడ వాసి



ఆత్మకూరి ప్రసాద్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్ : ద్విచక్ర వాహనంపై వస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉద్యోగికి ట్రాక్టర్ కల్టివేటర్ తాకడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఆత్మకూరి ప్రసాద్ (38) ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రభుత్వ జేవీఆర్ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సత్తుపల్లిలోని కృషి బైపాస్ రోడ్డులో నివాసముండే ఆయన గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై రాజీవ్‌నగర్ వెళ్లి వస్తుండగా సిద్దారం రోడ్డులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ కల్టివేటర్ కడుపులో దిగబడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చే సరికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రసాద్‌కు భార్య విజయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

నడిగూడెం : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతుల కల్పన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నడిగూడెం తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వీరబాబు, బీఎల్‌ఓ కొండలమ్మ, తదితరులు ఉన్నారు.

ఘనంగా అన్నమాచార్యుల జయంతి



గరిడేపల్లి : అన్నమాచార్యుల కీర్తనలను ఆలపిస్తున్న భక్తులు



నేరేడుచర్ల : గాయకులను సన్మానిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : తెలుగు కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతిని గురువారం నేరేడుచర్లలోని కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా గాయకులు దామోదరాచార్యులు, నాగేందర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాచకొండ రామచందర్‌రావు, చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, రాచకొండ విజయలక్ష్మి, అరుణకుమారి, లక్ష్మణ్, నర్సింహారావు, శ్రీనివాస్, లక్ష్మీపసన్న, కవిత, వాసంతి, శ్రీనివాస్‌రావు, సూర్యనారాయణరెడ్డి, క్రాంతికుమార్, నటరాజ్, మాదవరావు, కృపాకర్, మధు, వెంకటరమణారావు, పరమేశం, లూకాస్ తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామి మందిరంలో..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి మందిరంలో గురువారం అన్నమాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తొలి వాగ్గేయకారుడు అన్నమాచార్యులను స్మరించుకొని అతను రచించిన కీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అన్నం వెంకట్రామయ్య, కొంపెల్లి తారకరామం, శ్రీరామ కవచం సుబ్రహ్మణ్యశాస్త్రి, రెంటా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్లుగా వైద్య శిబిరం ఏర్పాటు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రఘువర్మ

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇరవై ఏళ్లుగా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎన్‌సీఎల్ పరిశ్రమ ప్రెసిడెంట్ వర్క్స్ చక్రధర్ అన్నారు. గురువారం స్థానికంగా పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన బైసన్ బోర్డ్స్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ రఘువర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని చక్రధర్ సందర్శించి మాట్లాడారు. రెండు రోజులపాటు సుమారు 1000 మంది భక్తులకు వివిధ రుగ్మతలకు వైద్యం చేయడంతో పాటు రూ.40వేల విలువ గల మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేగాక బ్లూక్రాస్ లేబరేటరీస్, రెడ్‌క్రాస్ సొసైటీల సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎల్ అధికారులు సతీష్‌కుమార్, దస్తగిరిరెడ్డి, వైద్యాధికారి జె.శ్రీహరిరావు, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి



మఠంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు శ్రీలతారెడ్డి

మఠంపల్లి : పట్టభద్రులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి కోరారు. గురువారం మఠంపల్లిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఆమె సందర్శించి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి వరుణ్‌రెడ్డి, నరేష్, ఎల్లయ్య, బాలునాయక్, వెంకటశివ, తదితరులు ఉన్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



నడిగూడెంలో..

నడిగూడెం : ఈ నెల 27న జరిగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రొండ్ల శ్రీనివాసరెడ్డి, కోదాడ నియోజకవర్గ ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ రౌతు కళ్యాణ్, మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, నాయకులు పరబ్రహ్మాచారి, వీరన్న, నూకపంగు గుర్వయ్య, పాపయ్య, ప్రసాద్, లింగరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం నిత్యహోమం, బలిహరణ, ప్రత్యేక అభిషేకాలు, తీర్థప్రసాదాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ : చెరువు శిఖం భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని కృష్ణారెడ్డి కుంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కుంట 18.20 ఎకరాల్లో ఉండాల్సి ఉండగా 11 ఎకరాలకు పైగా ఆక్రమించి సమీపంలోని సాగు చేస్తున్నారని, అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని ఇటీవల తనకు కొంతమంది ఫిర్యాదు చేశారని తెలిపారు. చెరువు శిఖం భూములు కబ్జా కాకుండా ఐబీ అధికారులు హద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలోని 13 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని బకల్‌వాడీ, బాలికల ఉన్నత పాఠశాల, తాళ్లగడ్డ జిల్లా పరిషత్ హైస్కూల్, నాగార్జున డిగ్రీ కళాశాల,, ఈదులగూడెం ప్రభుత్వ పాఠశాల, సుందర్‌నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పారిశుద్ధ్య సిబ్బంది పోలింగ్ కేంద్రాలను శుభ్రంగా ఉంచాలని ఆయన తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

వైభవంగా తిరుకల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుకల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

భానుపురి : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఉదయం నుంచి ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధనలు, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పూర్ణాహుతి నిర్వహించి సాయంత్రం 8గంటల సమయంలో వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆండాళ్‌గోష్ఠి భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరనిలోటు

భానుపురి : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పెన్నా అనంతరామ శర్మ మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. నీతికి నిజాయితీకి మారుపేరుగా అనంతరామ శర్మ జీవించాడని తెలిపారు. పార్టీకి మార్గదర్శిగా, ఆచరణ వాదిగా పని చేశారని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, నాయకులు దండా వెంకట్‌రెడ్డి, ఎల్గూరి గోవింద్, శేఖర్, నరసింహారావు, శ్రీకాంత్, కొప్పుల రజిత, నరసయ్య, రాములు, పాల్గొన్నారు.